# యాక్ట్ ఫైబర్‌నెట్‌గా మారిన బీమ్




**యాక్ట్ ఫైబర్ నెట్ కొత్తలోగోతో కంపెనీ సీఈవో బాల, డైరెక్టర్ సుందర్ రాజు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** ఆప్టికల్ ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సర్వీసులు అందించడంలో అగ్రగామి సంస్థ బీమ్ ఫైబర్ పేరు మార్చుకుంది. 2009లో బీమ్ ఫైబర్‌ను టేకోవర్ చేసిన యాక్ట్ గ్రూపు తాజాగా దేశవ్యాప్తంగా ఒకే బ్రాండ్‌తో సేవలు అందించేందుకు వీలుగా 'యాక్ట్ ఫైబర్‌నెట్'గా మార్చుకున్నట్లు కంపెనీ సీఈవో బాల మల్లాది తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో నెట్ సర్వీసులు అందిస్తున్న సంస్థ తాజాగా దక్షిణాదిపై దృష్టి సారించింది. 2025 నాటికి పది నగరాల్లో డేటా సర్వీసులు అందించడానికి రూ.1,000 కోట్ల స్థాయిలో పెట్టుబడులు పెట్టనున్నట్లు బాల పేర్కొన్నారు. ఈ కొత్త బ్రాండ్‌ను మార్కెట్లో ప్రచారం కల్పించేందుకు వచ్చే రెండు నెలల్లో రూ.10 కోట్ల స్థాయిలో పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇంటర్నెట్ సర్వీసులు అందిస్తున్న బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్, ఎయిర్‌టెల్ సంస్థలు మూడు శాతం మేర వృద్ధిని నమోదు చేసుకుంటే అదే బీమ్ 43 శాతానికి పైగా అధిక వృద్ధిని నమోదు చేసుకుందన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. 2013 సంవత్సరంలో రూ.500 కోట్ల టర్నోవర్ సాధించిన సంస్థ ప్రస్తుతేడాది రూ.850 కోట్ల స్థాయికి చేరుకోనున్నదని ఆయన అంచనావేస్తున్నారు.

**100 ఎంబీపీఎస్ ప్లాన్ ఆవిష్కరించిన సంస్థ:** రిటైల్ వినియోగదారులకు ఇప్పటికే అత్యంత వేగవంతమైన డేటా సర్వీసులు అందిస్తున్న సంస్థ తాజాగా 100 ఎంబీపీఎస్ ప్లాన్ ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్ కింద 200 జీబీ మెమొరీని వేగవంతంగా డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుంటుంది. నెలకు గరిష్ఠంగా రూ.2,799 వసూలు చేయనున్నది. ప్రస్తుతం 4 నుంచి 15 ఎంబీపీఎస్ డేటా స్పీడ్ ప్యాకేజ్‌లో ఉన్న వినియోగదారులు వచ్చే ఏప్రిల్ 1నుంచి ఆటోమెటిక్‌గా 5 నుంచి 20 ఎంబీపీఎస్ పథకం పరిధిలోకి అప్‌గ్రేడ్ అవుతారని ఆయన తెలిపారు. ప్రస్తుతం సంస్థకు 7 లక్షల మంది వినియోగదారులు ఉండగా, వచ్చే ఏడాది చివరికల్లా పది లక్షలకు పెంచుకోవాలనుంటున్నట్లు బాల పేర్కొన్నారు. ఇప్పటికే నల్గొండలో మీడియా సర్వీసులు అందిస్తున్న సంస్థ తాజాగా ఇంటర్నెట్ సర్వీసులు అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది.